క్లుప్తంగా

విష్ణు భౌతిక కాయాన్ని సందర్శించిన చైర్మన్ గఫార్

కనిగిరి రూరల్: స్థానిక దేవాంగ నగర్ వద్ద ఆటోను కారు ఢీ కొన్న ప్రమాదంలో మృతి చెందిన బత్తుల విష్ణు నారాయణ (57) భౌతిక కాయాన్ని మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ ఆదివారం సందర్శించి నివాళులర్పించారు. ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. మృతుని కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపి, తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు.

నేటి నుంచి ఉచిత వేసవి శిక్షణ తరగతులు

కొండపి (సింగరాయకొండ): కాలాన్ని సద్వినియోగం చేసుకొని ప్రతి విద్యార్థి విద్యతో పాటు మానసికంగా ఎదగాలనే సంకల్పంతో మే 20 నుంచి మే 31 వరకు ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు వేసవి ఉచిత శిక్షణ తరగతులను కొండపిలోని టీజే ఇన్నోవేటివ్ సెంటర్‌లో నిర్వహిస్తున్నామని కోర్స్ డైరెక్టర్ ఎల్‌వీ ప్రసాద్ తెలిపారు. ఎల్‌వీ ప్రసాద్ మాట్లాడుతూ ఈ శిక్షణలో 3వ తరగతి నుంచి 10వ తరగతి వరకు చదివే విద్యార్థులకు చక్కని చేతిరాత, రంగు రంగు బొమ్మలు గీయడం, మ్యాజిక్ వెనుక లాజిక్ తెలుసుకోవడం, వేదికపై ధైర్యంగా మాట్లాడగలగడం, జీవన గణితం, ఒరిగామి, పేపర్ కటింగ్, స్పోకెన్ ఇంగ్లీష్, హిందీ అంటే భయం పోగొట్టడం, అనే అంశాలపై ఆయా రంగాల్లో నిపుణులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తామన్నారు.

కొండపిలో కార్డెన్ సెర్చ్


స్వాధీనం చేసుకున్న వాహనాలతో పోలీస్ అధికారులు

కొండపి (సింగరాయకొండ): ఎస్పీ గరుడ్ సుమిత్ సునీల్ ఆదేశాల మేరకు కొండపిలోని స్థానిక బీసీ కాలనీ, గొడగులపాలెంలో ఆదివారం ఉదయం 5 గంటల నుంచి 7 గంటల వరకు పోలీసులు కార్డెన్ సెర్చ్ చేశారు. కొండపి సీఐ పాండురంగారావు ఆధ్వర్యంలో కొండపి ఎస్సై కృష్ణ బాజీబాబు, పొన్నలూరు ఎస్సై రాజేష్, మర్రిపూడి ఎస్సై శివబసవరాజు, కొండపి సర్కిల్ పరిధిలోని పోలీస్ సిబ్బంది విస్తృత తనిఖీలు చేపట్టారు. ఇంట్లో ఎవరెవరు నివసిస్తున్నారు, ఇతర ప్రాంతాలకు చెందిన వారు దొంగతనాలు, నేరాలకు పాల్పడి తల దాచుకునేందుకు ఏమైనా వచ్చారా అని ఆరా తీశారు. సరైన పత్రాలు లేని 8 ద్విచక్రవాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు.

ఓగూరులో కార్డెన్ సెర్చ్

కందుకూరు: మండలంలోని ఓగూరు గ్రామంలో డీఎస్పీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఆదివారం పోలీసులు కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటిని క్షుణ్ణంగా తనిఖీలు నిర్వహించారు. తనిఖీల్లో గ్రామానికి చెందిన దార్ల క్రాంతికుమార్ ఇంట్లో 90 బాటిల్ అక్రమ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి స్థానికంగా అధిక ధరలకు క్రాంతి కుమార్ విక్రయిస్తున్న పోలీసులు గుర్తించారు. ముగిసిన సార్వత్రిక ఎన్నికల్లో ఓగూరు గ్రామంలో స్వల్ప ఉద్రిక్తత పరిస్థితులు నెలకొన్నాయి. ఈ నేపథ్యంలో ముందస్తు చర్యల్లో భాగంగా గ్రామంలో పోలీసులు భారీగా కార్డెన్ సెర్చ్ ఆపరేషన్ చేపట్టారు. నిబంధనలు అతిక్రమించి మారణాయుధాలు కలిగి ఉన్నా, చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడినా కఠిన చర్యలు తప్పవని ఈ సందర్భంగా పోలీసులు హెచ్చరించారు. స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్ల ఎక్సైజ్ శాఖ అధికారులకు అప్పగించారు.

శేషవాహన సేవలో వేణుగోపాలుడు

ఉలవపాడు: బ్రహ్మోత్సవాల్లో భాగంగా శనివారం అర్ధరాత్రి వేణుగోపాలునికి శేషవాహన సేవ నిర్వహించారు. రుక్మిణీ సత్యభామా సమేతుడైన వేణుగోపాలునికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పురవీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. భక్తులు స్వామి వారికి కొబ్బరికాయలు కొట్టారు. ఆదివారం ఉదయం పది గంటలకు చప్పర సేవ జరిపారు. ఆలయ కార్యనిర్వహణాధికారి ప్రసాద్ ఆధ్వర్యంలో భక్తులు వీక్షించడానికి అన్ని ఏర్పాట్లు చేశారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందించారు.


పామూరు: స్వామివార్ల శాంతి కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు, భక్తులు


పామూరు: స్వామివార్ల శాంతి కల్యాణోత్సవంలో పాల్గొన్న భక్తులు


ప్రత్యేక పూజల్లో చైర్మన్ అబ్దుల్ గఫార్

భక్తిశ్రద్ధలతో మహానివేదన

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రఖ్యాత పుణ్యక్షేత్రం మిట్టపాలెం శ్రీనారాయణ స్వామి ఆలయంలో ఆదివారం గోపూజ, మహానివేదన కార్యక్రమం అర్చకులు మంకాల సత్యనారాయణ, శివప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా నారాయణస్వామి వారి మూల విగ్రహమూర్తికి పంచామృతాభిషేకం, విశిష్ట పూజలు నిర్వహించారు. అనంతరం గోవుకు శాస్త్రోక్తంగా అర్చకులు గోపూజ నిర్వహించారు. ఈసందర్భంగా భజంత్రీల మేళతాళాలనడుమ మహా నైవేద్యంతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదం అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, సిబ్బంది పాల్గొన్నారు.

నేటి నుంచి కల్యాణ మహోత్సవం

హనుమంతునిపాడు: మండల పరిధి నల్లగండ్ల పంచాయతీ చిన్నగొల్లపల్లి గ్రామంలోని నాగులేటి ఒడ్డున వెలసిన శ్రీలక్ష్మీ చెన్నకేశ్వస్వామి కళ్యాణ మహోత్సవం నిర్వహిస్తున్నట్లు జిల్లా దేవాదాయశాఖ అధికారి కె.జనార్దన్ రెడ్డి ఆదివారం ఒక ప్రకటల్లో తెలిపారు. సోమవారం హనుమంతసేవ, 21 చెక్కావారి పొంగళ్లు నీలకంఠాపురం, రంగంపేట, లింగంగుంట్ల, యాదవ రాజులు, వాలిచర్ల, మార్కాపురం చెక్కావారిచే యాదవరాజుల గరుడ సేవలు, 22 మోహిని


వల్లూరులో ప్రత్యేక అలంకరణలో వల్లూరమ్మ తల్లి

ఉత్సవం, రాత్రికి గజోత్సవం, 23 కంపకల్లి వసంతోత్సవం, 24 ఏకాంత సేవ కార్యక్రమాలు ఉంటాయన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొనాలని కోరారు.

టీటీడీ కల్యాణ మండపం త్వరలో ప్రారంభం

సీఎస్‌పురం (పామూరు): మండలంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణ స్వామి ఆలయం సమీపంలో నిర్మించిన టీటీడీ కల్యాణ మండపాన్ని జూన్‌లో ప్రారంభించేందుకు కృషి చేస్తున్న వైఎస్సార్ సీపీ మైనారిటీ సెల్ రాష్ట్ర కార్యదర్శి షేక్ బుజ్జి అన్నారు. నారాయణ స్వామి ఆలయం వద్ద సుమారు 10 సంవత్సరాల క్రితం తిరుమల తిరుపతి దేవస్థానాల ఆధ్వర్యంలో కల్యాణ మండపం నిర్మించారు. చిన్నా చితక పనుల పూర్తి కాకపోవడం, ఇతర కారణాలతో కల్యాణ మండపం ప్రారంభంకాలేదన్నారు.


మహానివేదనలో అర్చకులు, పాల్గొన్న నాయకులు, భక్తులు

దీనిపై స్థానిక నాయకులు కలుగజేసుకుని విషయాన్ని రాజ్యసభ సభ్యులు వైవీ సుబ్బా రెడ్డి దృష్టికి తీసుకుపోయి ఆయన చొరవతో టీటీడీ కల్యాణ మండపంలో చిన్నా చితక మరమ్మతుల పనులను త్వరిగతిన పూర్తిచేసి కల్యాణ మండపాన్ని జూన్ మాసంలో ప్రారంభిస్తామన్నారు. ఈమేరకు రవి ఇంజినీరింగ్ సంస్థ టెండర్ దక్కించుకుందన్నారు. సమావేశంలో గోను చంద్రశేఖర్ రెడ్డి, పాలపర్తి నారాయణరావు, బొట్ల చిరంజీవి, కురకుల అంకయ్య యాదవ్, ఏలిక నాగేశ్వర రావు, బలబద్రజాన్ పలువురు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో నీలకంఠేశ్వర స్వామి కల్యాణం

పామూరు: మండలంలోని దాదిరెడ్డిపల్లి గ్రామంలో శ్రీపార్వతీ సమేత నీలకంఠేశ్వరస్వామి ఆలయంలో స్వామివార్ల శాంతి కల్యాణోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా


టీటీడీ కల్యాణ మండప ప్రారంభం, మరమ్మతులపై చర్చిస్తున్న నాయకులు

అర్చకులు పార్వతీదేవి అమ్మవారి మూలవిగ్రహ మూర్తికి అభిషేకం, కుంకుమార్చన, నీలకంఠేశ్వర స్వామి వారికి ఏకాదశ రుద్రాభిషేకం నిర్వహించారు. అనంతరం స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తులను వేడుకగా మంగళవాయిద్యాల నడుమ కల్యాణ మండపానికి తరలించి వేదమంత్రాలతో శాస్త్రోక్తంగా శాంతికల్యాణం నిర్వహించారు. అనంతరం సాయంత్రం స్వామివార్ల ఉత్సవమూర్తులకు గ్రామోత్సవం కన్నుల పండువగా నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయకమిటీ,భక్తులు పాల్గొన్నారు.

వల్లూరమ్మ ఆలయానికి పోటెత్తిన భక్తులు

టంగుటూరు: జిల్లాలో ప్రసిద్ధిగాంచిన వల్లూరమ్మ ఆలయంలో ఆదివారం సందర్భంగా అధిక సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. అమ్మవారికి అభిషేకాలు, కుంకుమ పూజ, గోత్రనామార్చనలు, మొదలగు ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తమ మొక్కులు తీర్చుకొని, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వాహన పూజలు నిర్వహించారు. వల్లూరమ్మ ట్రస్టు బోర్డు చైర్మన్ కాలె శ్రీనివాసులు, ఆలయ ఈఓ రమేష్ భక్తులకు ఇబ్బందులు లేకుండా ఏర్పాట్లు చేశారు. ఆలయ ప్రధాన అర్చకులు నాగేశ్వరరావు, ఉప ప్రధాన అర్చకులు ఉమాశంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పోలేరమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

కనిగిరి రూరల్: పట్టణంలోని దొంతులమ్మ గుడిలో కొలువైన పోలేరమ్మ తల్లికి ఆదివారం పొంగళ్ల మహోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా మున్సిపల్ చైర్మన్ ఎస్కే అబ్దుల్ గఫార్ అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రామయ్య నాయుడు, ఆదిలక్ష్మి దంపతులు, కంటు గురవయ్య, టంగుటూరి గోవిందరావు, మాలకొండేశ్వరరావు, కంచర్ల బ్రహ్మయ్య, న్యాయవాది శంకర్, బొట్టు శ్రీను, చిన్నిగారి కొండలు, మాజీ వార్డు సభ్యులు సయ్యద్ నాయబ్ రసూల్ తదితరులు పాల్గొన్నారు.

43 మందికి వైద్య సేవలు

కొండపి (సింగరాయకొండ): మండలంలోని కట్టవారి పాలెం గ్రామంలో స్థానిక స్వచ్ఛంద సేవా సంస్థ మన ఊరి వికాసం ఆధ్వర్యంలో ఆదివారం వైద్య శిబిరం నిర్వహించి 43 మందికి ఉచిత వైద్య పరీక్షలు చేశారు. ఈ వైద్య పరీక్షలు ఒంగోలు దేవి హాస్పిటల్ వైద్యులు డాక్టర్ కంకణాల కృష్ణమోహన్, హాస్పిటల్ సిబ్బంది నిర్వహించారు. డాక్టర్ కృష్ణమోహన్ మాట్లాడుతూ బీపీ, షుగర్ వ్యాధులు ఇతర వ్యాధుల వల్ల జబ్బులు కాదని శరీరంలో కొన్ని గ్రంథులు సరిగా పనిచేయకపోవడం, ఇతర సాంకేతిక కారణాల వలన ఏర్పడే మెటాబాలిక్ లోపాలన్నారు. 40 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ అప్పుడప్పుడు షుగరు, బీపీ పరీక్షలు చేయించుకొని రోగ నిర్ధారణ చేసుకోవడం ముఖ్యం అన్నారు. అశ్రద్ధ చేస్తే ముప్పు తప్పదని తెలిపారు. అందరూ ధ్యానం, యోగా వంటివి సాధన చేస్తూ ప్రశాంతం జీవితం అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు బొక్కిసం సుబ్బారావు, రావెళ్ళ చెంచయ్య, వీరమోసు మస్తాన్, మానికొండ వెంకటేశ్వర్లు, ఆరోగ్య భవనం దాత గుంటుపల్లి పద్మావతి పాల్గొన్నారు.


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్ కృష్ణమోహన్

సుందరయ్యకి జోహార్లు



కొండపి: నివాళులర్పిస్తున్న మస్తాన్


పొందూరులో సుందరయ్యకు నివాళులర్పిస్తున్న నాయకులు

టంగుటూరు: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా ఆదివారం టంగుటూరు మండలంలోని పొందూరు గ్రామంలో సీపీఎం కార్యాలయంలో నాయకులు పంది బాలకోటయ్య ఎర్ర జెండా జోహార్లు అర్పించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల అధ్యక్షుడు వేసుపోగు మోజేసు మాట్లాడుతూ సుందరయ్య జీవితం నేటి తరానికి ఆదర్శం కావాలన్నారు. మన దేశంలో దోపిడీలు, దుర్మార్గాలు అంతం కోసం ఎనలేని కృషి చేశారని తెలిపారు. సుందరయ్యకి నివాళులర్పించడం అంటే సమసమాజం కోసం జరిగే పోరాటాల్లో ప్రజలంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సీపీఎం పొందూరు కమిటీ కార్యదర్శి వేజండ్ల సింగయ్య, వెంకటేశ్వర్లు, ప్రసాదు, సుధాకర్, సాగర్, నాగరాజు, పిచ్చిబాబు, తదితరులు పాల్గొన్నారు.

కొండపి (సింగరాయకొండ): కామ్రేడ్ పుచ్చలపల్లి సందరయ్య 39వ వర్ధంతి సందర్భంగా కొండపిలో సీపీఎం మండల కార్యదర్శి కేజీ మస్తాన్ ఆధ్వర్యంలో ఘన నివాళులర్పించారు. కేజీ మస్తాన్ మాట్లాడుతూ పుచ్చలపల్లి సుందరయ్య జీవితం ప్రజా అంకితం అని, ఆంధ్రప్రదేశ్‌లో ఏర్పడిన వ్యవసాయ కార్మిక సంఘం ఈ రోజు భారతదేశం వ్యాప్తంగా సంఘం ఏర్పాటు చేసి తిండి అయినా పెట్టండి.. పనైనా చూపండి, అని మెదటి నినాదం చేసిన మహనీయుడు సుందరయ్య అన్నారు. కార్యక్రమంలో కోటిరెడ్డి, శివరామయ్య, సాయమ్మ, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఘనంగా పూర్వ విద్యార్థుల సమ్మేళనం


ఒకే వేదికపై చేరిన పూర్వ విద్యార్థులు

టంగుటూరు: స్థానిక కొండపి రోడ్డులోని కామని రామయ్య, సీతా రత్నం కళ్యాణ మండపంలో ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో 1991- 1996 విద్యార్థుల కుటుంబాలు ఆదివారం ఆత్మీయ పూర్వ విద్యార్థుల సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఉచిత కంప్యూటర్ శిక్షణ పొందిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, జామ మొక్కలు పంపిణీ చేశారు. ఫ్రెండ్స్ ఆర్గనైజేషన్ అనారోగ్య కారణాలకు రూ. 25 వేలు, విద్యార్థులకు ప్రత్యేకమైన విద్యకు సహాయ సహకారాలు అందిస్తామని తీర్మానించారు. అనంతరం ఒకరిని ఒకరు ఆత్మీయంగా పలికరించుకున్నారు.